క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మోడల్ పాఠశాలలో మూడు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ స్లీవరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు, పీజీటీ-2, హిందీ, పీజీటీ-1 ఖాళీగా ఉన్నాయని, బీఈడీ చేసిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 21 వరకు అవకాశం ఉందని తెలిపారు.

మంత్రి సీతక్కకు వినతి



సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

కొమురవెల్లి(సిద్దిపేట): చేర్యాల మండలంలోని వేచరేణి పంచాయతీ పరిధిలోని ఎల్లాదాసునగర్‌ను పంచాయతీగా ప్రకటించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎల్లాదాస్‌నగర్ వాసులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధిర గ్రామంగా కొనసాగుతున్న ఎల్లాదాసునగర్ అభివృద్ధి చెందడం లేదన్నారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్, ఆంజనేయులు, రమేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం స్వచ్ఛత, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అనే అంశాలపై విద్యార్థులు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జనార్దన్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛత, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కలిగి ఉండడానికి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న తిరుపతి

హుస్నాబాద్: హైచ్‌ఐవీపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ రేశవేన తిరుపతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశానుసారం ఇంటెన్సిఫైడ్ క్యాంపెయిన్ 2024లో భాగంగా గురువారం సీవీ రామన్ హైస్కూల్‌లో 9, 10వ తరగతి విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్, టీబీ హెపటైటిస్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ అపోహలు విడనాడాలన్నారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకూడదని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణరెడ్డి, సైన్స్ టీచర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు ట్యాగ్‌లు

అక్కన్నపేట(హుస్నాబాద్): గణనలో భాగంగా గొర్రెలు, మేకలకు ట్యాగ్‌లు వేస్తున్నామని పశు వైద్య సహాయకుడు ఉమానాయక్ చెప్పారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లిలో గురువారం గొర్రెలకు ట్యాగులు వేసి, వాటి వివరాలను ఆన్‌లైన్లలో నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గొర్రెలు, మేకల వివరాలను నమోదు చేస్తున్నామన్నారు.

చక్కెర లారీ బోల్తా

దుబ్బాకరూరల్: జాతీయ రహదారిపై చక్కెర లారీ బోల్తా పడిన ఘటన హబ్సీపూర్ శివారులో జరిగింది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట నుంచి సిద్దిపేట వైపు వస్తున్న చక్కెరలోడ్ లారీ రహదారి ప్రక్కన కల్వర్టును ఢీకొట్టి రోడ్డుపై బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. లారీ పాక్షికంగా దెబ్బతిన్నది.



బోల్తాపడిన చక్కెర లారీ

లీకేజీతో నీరంతా వృథా

కాకతీయుల కాలంలో నిర్మించిన ఎల్లమ్మ చెరువు నిండుకుండగా జలకళను సంతరించుకుంది. కాని తూమ్ లీకేజీతో పది మోటర్ల నీరు వృథాగా పోతోంది. పట్టణంలోని ఎల్లమ్మ చెరువు ద్వారా దాదాపు రెండు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండిందని సంతోషపడాలో.. లేక తూమ్ లీకేజీతో నీరు వృథాగా పోతుంటే బాధపడాలో అర్థంగా కాని పరిస్థితిలో పడ్డారు రైతులు.



లీకేజీకి అడ్డుకట్ట వేస్తున్న రైతులు

హుస్నాబాద్ : ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు. నిత్యం తూమ్ నుంచి నీరు వృథాగా పోతున్నా చర్యలు లేవు. గతంలో కొందరు రైతులు తూమ్ వద్ద ఇసుక బస్తాలువేసి అడ్డుకట్ట వేయాలని ప్రయత్నం చేసినా అది సాధ్యం కాలేదు. ఇరిగేషన్ అధికారులు వచ్చి చూడడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. తూమ్ కింద మధ్య భాగంలో కంకరతో నిండిన సిమెంట్ మిద్దె అడ్డుగా ఉండడంతో పైన షట్టర్లు దించినా.. నీరు ఆగడం లేదని రైతులు అంటున్నారు. సిమెంట్ దిమ్మెను పగుల గొట్టేందుకు ప్రయ త్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. డ్రిల్లింగ్‌చేస్తే తప్ప నీటి లీకేజీ అగే పరిస్థితి ఉండదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం చెరువు నిండిపోవడంతో తూమ్ కిందికిదిగే పరిస్థితి లేదు. రెండు, మూడు రోజుల నుంచి తూమ్ నుంచి నీరు అధికశాతం లీకేజీ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వృథాగా పోతున్న ఎల్లమ్మ చెరువు నీరు

- రెండో తూమ్ వద్ద సమస్య
- రైతులు ప్రయత్నించినా ఫలితం శూన్యం
- మునుగుతున్న పంట పొలాలు
- ఏళ్లు గడుస్తున్నా అరికట్టని అధికారులు

నీట మునుగుతున్న పొలాలు

ప్రస్తుతం నీటి లీకేజీతో వరి పొలాలు మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ రజిత ఆధ్వర్యంలో రైతులు తూమ్ నీళ్లకు అడ్డుకట్ట వేసేందుకు మట్టి నింపారు. కాని లీకేజీ మాత్రం ఆగలేదు. ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా ప్రభుత్వం రూ.18కోట్లు మంజూరు చేసింది. కట్టను సుందరీకరించడం మంచి పరిణామమే కాని నీళ్లు వృథాగా పోతుంటే ప్రయోజనం ఏ ముంటుందని రైతులు వాపోతున్నారు.

లీకేజీని అరికట్టండి



ఎల్లమ్మ చెరువు రెండో తూమ్ నుంచి సాగునీరు వృథాగా పోతోంది. ఇరిగేషన్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. రెండు రోజుల నుంచి లీకేజీ తీవ్రత మరింత పెరిగింది. ఆయకట్టు రైతులు మట్టి పోసి అడ్డుకట్ట వేసినా లీకేజీ ఆగడం లేదు. ఇప్పటికే చెరువు నీటి సామర్థ్యం మూడు ఫీట్లు తగ్గింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – ఆకుల హన్మయ్య, రైతు, హుస్నాబాద్

పంటలు మునుగుతున్నాయి



ఎల్లమ్మ చెరువు నుంచి విడుదలచేసే నీటిని పంటలకు పారించుకుంటున్నాం. తూమ్ నుంచి నీటి లీకేజీతో పంటలు మునుగుతున్నాయి. నీళ్లు ఎక్కువైతే వరి మురిగిపోయే ప్రమాదం ఉంది. వందలాది మంది రైతులు ఎల్లమ్మ చెరువు పైనే ఆధారపడ్డాం. అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదు. శాశ్వత పరిష్కారం చూపాలి.
– పచ్చిమట్ల రాజు, రైతు, హుస్నాబాద్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 28మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూత్రశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. వడ్లూరు-బేగంపేట రోడ్డు పనులు పరిశీలించారు. ఎస్‌జీఎఫ్ క్రీడలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల కోసమే పని చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేయగా తమ ప్రభుత్వం 15లక్షలకు పెంచిందని ఆయన చెప్పారు. కార్యక్రమాలలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్, నోడల్ అధికారి మహతి లక్ష్మి, ఎంఈఓ పావని, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, ఒగ్గు దామోదర్, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ఖ్యాతిని చాటిచెప్పాలి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: చలనచిత్రరంగంలో రాణించి గజ్వేల్ ఖ్యాతిని చాటిచెప్పాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పిలుపునిచ్చారు. శ్రీజగన్మాత రేణుక క్రియేషన్స్ బ్యానర్‌పై గజ్వేల్ ప్రాంతానికి చెందిన ప్రొడ్యూసర్లు సామ శ్రీధర్, పంజాల వెంకట్‌గౌడ్, గౌరిశెట్టి శ్రీనివాస్ సాధర్యంలో ప్రొడక్షన్ నెంబర్ వన్ ద్వారా దర్శకుడు బన్నీ అశ్వంత్ రూపొందిస్తున్న రాజ మార్కండేయ సినిమా షూటింగ్ గురువారం గజ్వేల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ ఈ సినిమాలో నూతన నటులకు అవకాశం కల్పించడంపై యూనిట్ సభ్యులను అభినందించారు. మాజీ డీఎస్పీ కాల్వ శ్రీధర్‌రావు, ఆర్యవైశ్య నాయకులు సంతోష్, భిక్షపతి, సినీ నటులు తేజస్, నాగేష్, శ్రీనివాస్‌నాయుడు, ప్రత్యూష, దీపిక, సింగర్ నవీన్, ప్రశాంతి, మహేష్, రాధ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటంవల్లే భూములు

సీపీఎం జిల్లా నేత శశిధర్



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

హుస్నాబాద్: నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఫలితంగానే పేదలకు భూములు దక్కాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవంలో భాగంగా గురువారం హుస్నాబాద్‌లోని అనబేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ నేడు తెలంగాణ సమాజం అనుభవిస్తున్న స్వేచ్ఛా వాయువుల వెనుక వేలాది మంది కమ్యూనిస్టుల త్యాగం దాగి ఉందన్నారు. బీజేపీ వంటి మతోన్మాద పార్టీలు రెండు వర్గాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించడం తగదని మండిపడ్డారు. రాజకీయ అవసరాల కోసం చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీకి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో గోపాలస్వామి, రవికుమార్, శివరాజ్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

గ్రామస్తుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని అక్కారం, శ్రీగిరిపల్లి, కోనాపూర్ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్ సబ్‌స్టేషన్ నుంచి ఒకే ఫీడర్‌పై శ్రీగిరిపల్లి మీదుగా క్రషర్ మెషీన్లకు, పాతూరు, ఇప్పలగూడెం, కిష్టాపూర్, గణేష్‌పల్లి, తీగుల్, హవాయిగూడెం, కోనాపూర్, అక్కారం గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్య తలెత్తినపుడు ఎల్‌సీలు తీసుకోవడం వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, దీంతో ఇళ్లలో ఉండే ఎలక్ట్రానిక్ పరికరాలు, వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి అక్కారం, శ్రీగిరిపల్లి గ్రామాలకు వేర్వేరుగా ఆన్-ఆఫ్‌లు బిగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.

నాలుగు డీఏలు ప్రకటించాల్సిందే

విశ్రాంత, పెన్షనర్స్ సంఘం నేత సీతారామ్



మాట్లాడుతున్న సీతారామ్

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రంలో విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సీతారామ్ డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో అసోసియేషన్ జిల్లా కన్వీనర్ బేజాడి బాల్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం అందించి, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు ప్రకటించి ఏక కాలంలో బకాయిలు చెల్లించాలన్నారు. అలాగే 40శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని కోరారు. ఈ కుబేర్‌లో పెండింగ్ ఉన్న ఏరియర్స్ సత్వరమే చెల్లించి, ఈపీఎస్, కోల్ మైన్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు చెల్లించాలని కోరారు. అనంతరం అసోసియేషన్ నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడుగా మంతెన అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కర్రెడ్ల రాజిరెడ్డి తదితరులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ముసాయిదాపై సమావేశాలు



అక్కన్నపేట(హుస్నాబాద్): మాట్లాడుతున్న ఎంపీడీఓ జయరాం

- నవరణకు సహకరించాలి: ఎంపీడీఓలు
- తప్పులపై పలుచోట్ల అభ్యంతరాలు

అక్కన్నపేట(హుస్నాబాద్)/మిరుదొడ్డి(దుబ్బాక)/గజ్వేల్‌రూరల్/ హుస్నాబాద్‌రూరల్ /సిద్దిపేటరూరల్/కొమురవెల్లి(సిద్దిపేట)/దౌల్తాబాద్ (దుబ్బాక)/కోహెడ(హుస్నాబాద్)/చేర్యాల(సిద్దిపేట): మంత్రి ఇలాకాలోనే ఓటర్ల జాబితా ముసాయిదా తప్పుల తడకగా ఉండడంపై కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కన్నపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ భానోతు జయరాం అధ్యక్షతన ఓటర్ల జాబితా ముసాయిదాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేసిన వారి పేర్లు సైతం గల్లంతు కావడం ఏమిటని ప్రశ్నించారు. బతుకుదెరువు కోసం నగరాలకు వెళ్లిన వారి పేర్లు కూడా ఓటర్ల జాబితాలో లేవని వాపోయారు. పలు గ్రామాల్లో ఓటర్ల జాబితా ముసాయిదా తప్పుల తడకగా ఉందని వివిధ పార్టీల నాయకులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సాంబరాజు, ఎంపీఓ కవికుమార్, సూపరిండెండ్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గంగుల గణేష్‌రెడ్డి ఓటర్ లిస్టులపై అవగాహన కలిగించారు. ఎంపీఓ ఎండీ.జహారుద్దీన్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు రాజేష్, అంజిరెడ్డి, దేవరాజు పాల్గొన్నారు. గజ్వేల్‌రూరల్‌లో ఎంపీడీవో ప్రవీణ్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలున్నట్లయితే ఈనెల 26న డీపీవో ద్వారా మార్పులు చేసుకునేందుకు అవకాశముందన్నారు. ఓటర్ల జాబితా తుది ప్రచురణ ఈనెల 29న ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు. హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. జాబితా సవరణకు అందరూ సహకరించాలని కోరారు. డీఎల్పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ రమేశ్, రాజేంద్ర ప్రసాద్, మధన్‌మోహన్ రెడ్డి, శంకర్, మల్లారెడ్డి, చెంచెల ఎల్లయ్య పాల్గొన్నారు. ఓటర్ జాబితాకు సంబంధించిన అభ్యంతరాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సిద్దిపేటరూరల్ ఎంపీడీఓ శ్రీరాములు సూచించారు. నారాయణరావుపేట కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీఓ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి ఎంపీడీవో కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస వర్మ పాల్గొన్నారు. దౌల్తాబాద్‌లో ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ మాట్లాడారు. కోహెడలో ఎంపీడీఓ కృష్ణయ్య సమావేశం నిర్వహించారు. ఎంపీఓ శోభ, వెంకటేశం పాల్గొన్నారు. చేర్యాలలో ఎంపీడీఓ మహబూబ్‌అలీ నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్‌నేత రవి తదితరులు పల్గొన్నారు.

డీఈఓ పరామర్శ

సిద్దిపేటజోన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆయనకు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ జరిగింది. ఈ నేపథ్యంలో సహచర ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు అందజేసిన రూ.75వేల చెక్కును డీఈఓ బాధితుడికి అందజేశారు.

స్వచ్ఛతపై అవగాహన

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాల విద్యార్థులకు మున్సిపల్ ఆధ్వర్యంలో గురువారం తడి, పొడి, చెత్త సేకరణ, చెత్త పునర్వినియోగం గురించి తరగతులు నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా వివిధ రకాల కంపోస్టు విధానాలు, వర్మీ కంపోస్టు తయారీ, స్వచ్ఛ్ బడి పనితీరు గురించి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత విద్యార్థులకు వివరించారు.

వారిని సస్పెండ్ చేయండి

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీలో ఉంటూ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని సస్పెండ్ చేయాలని ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు కొమ్ము రవి, మంచాల చిరంజీవులు అధిష్ఠానానికి విన్నవించారు. గురువారం వారు మాట్లాడుతూ సెప్టెంబర్17న నిర్వహించిన ప్రజా పాలన సభలో కొమ్మూరి, మానసంపల్లి లింగాజి విప్ ఐలయ్య ప్రభుత్వం చేస్తున్న పనుల గురించి వివరిస్తుండగా కాంగ్రెస్ అసమ్మతి నేతలైన వేముళ్ల సత్యనారాయణ రెడ్డి, ఎర్రమల్ల సుధాకర్‌లతో కలిసి రభస చేయడం సబబుకాదన్నారు. వారిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. ఆగంరెడ్డి, మల్లేశం, లింగం, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, నరేందర్, యాదగిరి, శ్రీకాంత్, శివశంకర్, ఖాజా, దుర్గయ్య, రాము, నాగరాజు, వెంకటయ్య, రాజు, ప్రసాద్, మౌళి, సత్యనారాయణ, నాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవి, చిరంజీవులు

ఆటలలో గెలుపు ఓటములు సహజం

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆటలలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, అపుడే భవిష్యత్‌లో రాణించే అవకాశం ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండల ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) పోటీలను బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓ యాదవరెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి సిద్దిపేట జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ ఆటలు నాలుగు రోజులపాటు జరుగుతాయని, ఖో-ఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడాల్లో రాణించిన వారు జిల్లా స్థాయిలో ఆడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత యాదవ్, పీడీ, పీఈటీలు, ఉపాధ్యాయులు సుజాత, శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోమానసిక, శారీరక దృఢత్వం

తొగుట(దుబ్బాక): క్రీడలు మానసిక శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని ఎంఈవో సత్తు యాదవరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆవరణలో ఎస్‌జీఎఫ్ క్రీడలను గురువారం ప్రారంభించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉపేందర్, నర్సయ్య, అంజిరెడ్డి, నయమ కౌసర్, నాగిరెడ్డి, రాములు, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులు క్రీడల్లోను రాణించాలని ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ యాదగిరి కోరారు. మండలంలోని తిగుల్ ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడలను గురువారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, ప్రధానోపాధ్యాయులు సైదులు, కనకయ్య, అనసూయ, వెంకట్రామిరెడ్డి, శంకర్, సత్తయ్య, రాజనర్సయ్య, పీఈటీలు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు..

దుబ్బాకటౌన్/గజ్వేల్‌రూరల్: రాయపోల్ మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడ పోటీలు శుక్రవారం, శనివారం రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి నర్సమ్మ చెప్పారు. సెప్టెంబర్ 20, 21 తేదీలలో వాలీబాల్, ఖో- ఖో, కబడ్డీ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ పాఠశాలకు చెందిన అండర్ -17, అండర్- 14 బాలబాలికలందరూ పాల్గొంటారని చెప్పారు. అదేవిధంగా గజ్వేల్ ఐవోసీలోగల ఎంఈవో కార్యాలయంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈవో సునీత సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 24న బాలికలకు, 25న బాలురకు జీడీఆర్ పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఫోన్:96037 83280కు సంప్రదించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం**

గజ్వేల్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని మండల పరిధిలోని కొడకండ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మదునాల శ్రీనివాస్ సూచించారు. పాఠశాలలో గురువారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛత-పరిశుభ్రత అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఏఎన్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు రెహల, కల్పన, ఆశా వర్కర్‌లు రాజమణి, వినోద పాల్గొన్నారు.

◆ **ఓటుహక్కు నమోదు చేసుకోండి**

కోహెడరూరల్(హుస్నాబాద్): పట్టభద్రులంతా తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు కోరారు. గురువారం ఆయన మండలంలోని పలువురు పట్టభద్రులను, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌లను కలిశారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.


◆ **నీళ్లు చల్లిన గుర్తు తెలియని వ్యక్తులు**

మిరుదొడ్డి(దుబ్బాక): గుర్తు తెలియని వ్యక్తులు పురాతన శివాలయం గర్భగుడితో పాటు, గోడలపై పేడ నీళ్లు చల్లిన మరకలు దర్శనమిచ్చాయి. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం తెలియజేయడంతో అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసుల సమక్షంలో గ్రామస్తులు శివాలయాన్ని నీటితో శుద్ధిచేసి సున్నం వేయించారు.

◆ **పీఆర్‌టీయూ మున్సిపల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్**

దుబ్బాకటౌన్: పీఆర్‌టీయూ దుబ్బాక మున్సిపల్ నూతన అధ్యక్షుడిగా పల్లె శ్రీనివాస్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లచ్చపేట మోడల్ స్కూల్లో గురువారం నిర్వహించిన పీఆర్‌టీయూ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రారెడ్డి తదితరులను ఎంపికచేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రాసేన రెడ్డి పాల్గొన్నారు.

◆ **సత్ప్రవర్తన కలిగి ఉండాలి: సీఐ శ్రీను**



చేర్యాల(సిద్దిపేట): పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాత నేరస్తులంతా సత్ప్రవర్తన కలిగి ఉండాలని సీఐ ఎల్.శ్రీను సూచించారు. గురువారం స్థానిక సీఐ కార్యాలయం ఎదుట స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, నేరస్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

◆ **పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

సిద్దిపేటజోన్: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు పేర్కొన్నారు. గురువారం 9వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ గ్యాస్ సిలిండర్ రూ.500 రాయితీ పథకం మంజూరు పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు, నాయకులు పాల్గొన్నారు.

◆ **పంచాయతీ ఎన్నికలపై అభిప్రాయ సేకరణ**

బెజ్జంకి(సిద్దిపేట): పంచాయతీ ఎన్నికలపై అభిప్రాయ సేకరణ కోసం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఎంపీడీఓ ప్రవీణ్ సమావేశం నిర్వహించారు. బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం, బీఎస్‌పీ నాయకుల నుంచి ఎన్నికల ప్రక్రియపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.

◆ **బీజేపీ నేత దిష్టిబొమ్మ దహనం**

చిన్నకోడూరు(సిద్దిపేట): లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం చిన్నకోడూరులో కాంగ్రెస్ నాయకులు బీజేపీ నాయకుడు తన్వీందర్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీది దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం అన్నారు. పరశురామ్, రాజు, గణేష్, జయంత్, ప్రశాంత్, వెంకటేశ్, సంపత్ పాల్గొన్నారు.